సాక్షి నల్లగొండ
శుక్రవారం • 6 • జూన్ • 2025



అటానమస్‌కే ఆదరణ
డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు ఉండడం లేదు. అటానమస్ కాలేజీల్లో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. - 10లో



కాంగ్రెస్‌ది కమీషన్ల ప్రభుత్వం
రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీది కమీషన్ల ప్రభుత్వమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు విమర్శించారు. - 10లో

గరిష్టం/కనిష్టం 38°/26°

వాతావరణం
పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బధిరుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

నల్లగొండ : మిర్యాలగూడ సమీపంలోని అవంతీపురం ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో చెవిటి, మూగ విద్యార్థులకు 1 నుంచి 10వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.నంద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 8వ తరగతి వరకు ఇంగ్లిష్‌లో, 9, 10 తరగతులకు తెలుగులో బోధన ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు ఎలా చేయాలి, ప్రవేశాలకు గడువు, పాఠశాలలో సౌకర్యాలు తదితర వివరాల కోసం 9885842339 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్‌గా షరీఫ్


షరీఫ్‌కు నియామక పత్రం అందజేస్తున్న మద్దిలేటి

నల్లగొండ టూటౌన్ : మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలకు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్ -1 ప్రోగ్రాం ఆఫీసర్‌గా హిస్టరీ అధ్యాపకుడు డాక్టర్ మహమ్మద్ షరీఫ్‌ను నియమిస్తూ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ మద్దిలేటి గురువారం నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణప్రియ, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ అంజిరెడ్డి, పనస రామకృష్ణ, కాసాని శ్రీనివాస్, డాక్టర్ మద్దిరాల సత్యనారాయణరెడ్డి, వివేక్, అభినవ్, అరవింద్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

నల్లగొండ : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. గురువారం నల్లగొండలోని రెండుకేంద్రాల్లో నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షకు మొత్తం 66 మంది విద్యార్థులు హాజరైనట్లు డీఈవో భిక్షపతి తెలిపారు.

9న అప్రెంటిషిప్ మేళా

నల్లగొండ : ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఈ నెల 9న ఉదయం 10 గంటలకు అనుముల లోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో ప్రధాని జాతీయ అప్రెంటిషిప్ మేళా నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.మల్లికార్జున్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ పేర్లను వెబ్‌సైట్ www.apprenticeshipindia.gov.inలో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8686880100 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మానవ మనుగడకు చెట్లే ఆధారం


మొక్క నాటుతున్న జడ్జి ఎం.నాగరాజు

రామగిరి(నల్లగొండ) : మానవ మనుగడకు చెట్లే ఆధారమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ఆవరణలో గురువారం రాయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.పురుషోత్తమరావు, న్యాయమూర్తులు సంపూర్ణ ఆనంద్, దుర్గాప్రసాద్, రోజారమణి, కులకర్ణి, కవిత, ప్రమీలా జైన్, శిరీష, డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.భీమార్జున్‌రెడ్డి, లెనిన్ బాబు, న్యాయవాదులు జి.శ్రీనివాసచక్రవర్తి, జనిగల రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయిమెంట్ కార్డుతో ఉద్యోగావకాశాలు

నల్లగొండ : ఎంప్లాయిమెంట్ కార్డు కలిగిన వారికి ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగావకాశాల కల్పనలో ప్రాధాన్యం ఉంటుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎన్.పద్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వారి అర్హతలతో ఎంప్లాయిమెంట్ కార్డు కోసం మీ సేవ కేంద్రాల్లో, వెబ్‌సైట్ employment.telangana.gov.in వెబ్‌సైట్ నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్డు పొందిన వ్యక్తి 54 సంవత్సరాలు వచ్చే వరకు, ఉద్యోగం పొందే వరకు మళ్లీ రెన్యువల్ చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తులు

నల్లగొండ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉపకార వేతనాల కోసం ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతగల ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు వెబ్‌సైట్ telanganaepass.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

రేణుకా ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలు ప్రారంభం


పూజల్లో పాల్గొన్న ఆలయ పాలకవర్గం, భక్తులు, (ఇన్‌సెట్‌లో) బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్న ఈఓ, చైర్మన్

కనగల్ : భక్తుల పాలిట కొంగు బంగారం దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆలయ ఈఓ జల్లేపల్లి జయరామయ్య, చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి ప్రత్యేక పూజలతో ఉత్సవాలను ప్రారంభించారు. తెల్లవారుజామున మంగళ వాయిద్యాలతో సుప్రభాత, లలితా సహస్రనామర్చాన, మూలమంత్ర హోమాలు, గణపతి పూజలు, వాస్తు పూజ, నిత్య హోమాలను నిర్వహించారు. అనంతరం పుట్టబంగారం, అగ్ని ప్రతిష్ఠాపన వంటి కార్యక్రమాలను నిర్వహించి సాయంత్రం ఎదుర్కోలు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

నేడు కల్యాణ మహోత్సవం

శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కల్యాణమహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించనున్నారు. ఈ వేడుకకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. కల్యాణం అనంతరం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

బడి బస్సుపై నిర్లక్ష్యం ఏల!

- స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ చేయించుకోని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు
- పాఠశాలల పునఃప్రారంభానికి ముందే చేయించుకోవాలని నిబంధన
- జిల్లాలో 706 బస్సులకు, 296 బస్సులకే ఫిట్‌నెస్
- వీటిలో 15 ఏళ్ల గడువు దాటినవి 349 బస్సులు
- వాటిని నడిపేందుకు వీల్లేదంటున్న ఆర్టీఏ అధికారులు


మిర్యాలగూడలో స్కూల్‌బస్ ఫిట్‌నెస్‌ను తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : పాఠశాలల పునఃప్రారంభానికి కొద్ది రోజులే సమయం ఉన్నా జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సులకు ఫిట్‌నెస్ (సామర్థ్య) పరీక్షలు చేయించుకునేందుకు యాజమాన్యాలు ఆసక్తి చూపడంలేదు. నిబంధనల ప్రకారం విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే బడి బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించి ఆర్టీఏ కార్యాలయం నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందాల్సి ఉంటుంది. గతంలో ఫిట్‌నెస్ లేకున్నా కొందరు బస్సులను నడిపించారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈసారి ఆర్‌టీఏ అధికారులు మాత్రం ఫిట్‌నెస్ లేకుండా బస్సులు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

ఐదు రోజులే గడువు..

జూన్ 12 నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ప్రైవేట్ విద్యా సంస్థలకు సంబంధించిన బస్‌లను ముందుగానే ఫిట్‌నెస్ చేయించుకుని సిద్ధంగా ఉంచుకోవాలి. జిల్లాలో మొత్తం 706 బస్సులను ఆయా విద్యా సంస్థలు వినియోగిస్తున్నాయి. ఇప్పటివరకు కేవలం 296 బస్సులను మాత్రమే పిట్‌నెస్ చేయించారు. ఇంకా 410 బస్సులు ఫిట్‌నెస్ చేయించుకోవాల్సి ఉంది. ఈ నెల 12న స్కూళ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించుకోవడానికి ఇంకా ఐదు రోజులు మాత్రమే గడువు ఉంది.

15 ఏళ్లు దాటితే నడపొద్దు

జిల్లాలోని స్కూల్ బస్సుల్లో 15 సంవత్సరాలు గడిచినవి 349 బస్సులు ఉన్నాయి. వాటిని ఫిట్‌నెస్ చేయడానికి అవకాశం లేదు. అవన్నీ ఉపయోగించడానికి వీల్లేదు. అవి కండీషన్‌లో ఉన్నా కాలపరిమితి తీరినందున నిబంధనల ప్రకారం వాటిని నడిపేందుకు అవకాశం లేదని ఆర్‌టీఏ అధికారులు చెబుతున్నారు.

ఫిట్‌నెస్ లేకుండా బస్సులు నడిపితే సీజ్ చేస్తాం

ఫిట్‌నెస్ లేకుండా బస్సులు నడిపితే సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తాం. పాఠశాలలు ప్రారంభం నాటికే బస్‌లు అన్ని ఫిట్‌నెస్ చేయించుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా నడిపే బస్సులను గుర్తించేందుకు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేస్తాం. పిట్‌నెట్ లేకుండా బస్సులు నడపడానికి వీల్లేదు. – లావణ్య, ఎంవీఐ, నల్లగొండ

ఇవీ.. నిబంధనలు

- 15 ఏళ్ల కాలపరిమితి నిండిన బస్సుల్లో విద్యార్థులను రవాణా చేయడానికి వీల్లేదు.
- ప్రతి వాహనం (ప్రతి బడి బస్సు) పూర్తి కండీషన్‌లో ఉన్నట్టు ఆర్టీఏ అధికారులు ధ్రువీకరించాలి.
- బస్సు పసుపు రంగులో ఉండాలి. విద్యాసంస్థ పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్ బస్సు ఎడమవైపు ముందు భాగంలో కనిపించేలా ఉండాలి.
- ప్రతి విద్యాసంస్థ బస్సు, ఇతర వాహనం నడిపే వ్యక్తికి ప్రతి మూడు నెలలకు ఒక్కసారి బీపీ, కంటి, మధుమేహం వంటి పరీక్షలు చేయించుకోవాలి.
- వాహనం నడిపే డ్రైవర్‌కు ఐదేళ్ల అనుభం ఉండాలి. 60 ఏళ్లు దాటిన వ్యక్తిని డ్రైవర్‌గా నియమించొద్దు. బస్‌డ్రైవర్, బస్సుకు సంబంధించిన పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఉంచాలి.
- బస్సుకు అత్యవసర ద్వారం ఉండాలి.
- ప్రతి వాహనంలో మంటలార్పే పరికరాలు, మెడికల్ ఎమర్జెన్సీ కిట్ తప్పనిసరిగా ఉండాలి.
- విద్యార్థులు బస్సును ఎక్కడం, దిగడం వంటి దృశ్యాలు డ్రైవర్‌కు కనిపించేలా అద్దం ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రతి బస్సులో అటెండర్, విద్యార్థులు పట్టిక ఉండాలి. విద్యార్థి ఎక్కాల్సిన, దిగాల్సిన ప్రదేశం పేరు నమోదై ఉండాలి.
- విద్యార్థులు పుస్తకాలను పెట్టుకోవడానికి ప్రత్యేకంగా విభాగాలు ఏర్పాటు చేయాలి.

బడిబాటను విజయవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నల్లగొండ : జయశంకర్ బడిబాట కార్యక్రమాలను విజయవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ కోరారు. ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు జరగనున్న బటిబాట కార్యక్రమాలపై గురువారం నల్లగొండలో వివిధ శాఖల అధికారులు, జిల్లా మహిళా సమాఖ్య సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ తేదీ నాటికి పాఠశాలలను శుభ్రం చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. అదే రోజున యూనిఫాం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బడిబాట కార్యక్రమంలో మండల, జిల్లాస్థాయి అధికారులతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, పిల్లల తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. సమావేశంలో డీఈఓ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

నల్లగొండ : నల్లగొండలోని గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పవిత్రవాణి కర్ల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి తమ కళాశాలలో బీఏ(హెచ్‌ఈపీ), బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బిజినెస్ అనలిటిక్స్, బీఎస్సీలో ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంఎస్సీఎస్, ఎంఎస్‌డీఎస్, బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ గ్రూపులు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గలవారు తమ టెన్త్, ఇంటర్ మార్క్స్ మెమోలు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఐదు ఫొటోలతో ఈనెల 23వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9000229058, 8639109606 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వేసవి శిక్షణతో నైపుణ్యాలు మెరుగు


సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో డీఈఓ భిక్షపతి


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

నల్లగొండ టూటౌన్ : వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు మెరుగవుతాయని డీఈఓ భిక్షపతి అన్నారు. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో 35 రోజుల పాటు నిర్వహించిన క్రీడా శిక్షణ శిబిరాల ముగింపు కార్యక్రమానికి గురువారం ఆయన హాజరై మాట్లాడారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో 500 మంది విద్యార్థులు పాల్గొని వివిధ క్రీడల్లో నైపుణ్యం సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను మెరుగు పరిచే దిశగా క్రీడల శాఖ చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. ఆర్డీఓ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమకు నచ్చిన క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక శ్రమతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అనంతరం క్రీడాకారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి విమల, కోచ్‌లు నాగార్జున, నగేష్, శ్రీధర్, పవన్, శ్రీనివాసులు, సైదులు, అంబటి ప్రణీత్, ప్రేమ్, లోకేష్, లింగయ్య, సునీత, దాసు, నాగార్జున, ప్రకాష్‌నారాయణ, నజీరుద్దీన్ పాల్గొన్నారు.

నేడు తుర్కపల్లికి ముఖ్యమంత్రి రాక

- రూ.1,500 కోట్ల పనులకు తుర్కపల్లి మండలంలో తిర్మలాపురం వద్ద శంకుస్థాపనలు
- అక్కడే సభలో ప్రసంగించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేత



యాదగిరిగుట్ట : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లాలో పర్యటించనున్నారు. ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం సుమారు రూ.1,500 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఇందుకు ఆలేరు నియోజకవర్గంలోని తుర్కపల్లి మండలం తిర్మలాపురం గ్రామం వేదిక కానుంది. అన్ని అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలు తిర్మలాపూర్ వద్దనే ఆవిష్కరించనున్నారు. అక్కడే ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు ప్రోసీడింగ్స్ అందజేయనున్నారు. అనంతరం తిర్మలాపురం గ్రామంలో జరిగే సీఎం సభలో పాల్గొననున్నారు.

శంకుస్థాపన చేసే పనులు ఇవే..

- యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులకు వసతుల కల్పన, అభివృద్ధి పనులకు రూ.100 కోట్లు కేటాయించారు. టెంపుల్ సిటీలో 15 ఎకరాల్లో రూ.43.79 కోట్లతో వేద పాఠశాల నిర్మాణం. దాతారుపల్లి రెవెన్యూ పరిధిలోని వైటీడీఏ స్థలంలో రూ.180కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం, దాతారుపల్లిలో రూ.15కోట్లతో ఏర్పాటు చేసే వేర్ హౌజ్ గోదాములకు వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన చేయనున్నారు.
- తుర్కపల్లి మండలంలోని గంధమల్ల రిజర్వాయర్ పనులకు, రాంపూర్‌తండా సమీపంలో 15ఎకరాల స్థలంలో నిర్మించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన.
- ఆలేరు నియోజకవర్గంలో రూ.50 కోట్ల నిర్మించనున్న ఆర్‌అండ్‌బీ రోడ్లకు, రూ.14.50 కోట్లతో ఆలేరు మండలం కొలనుపాక, రాజాపేట మండలం కాల్వపల్లి వాగులపై హైలెవల్ బ్రిడ్జిలు, రూ.30 కోట్లతో సీఆర్ఆర్, ఎంఆర్ఆర్ రోడ్లకు, మోటకొండూర్‌లో రూ.10కోట్లతో ఎంపీపీ, తహసీల్దార్, పోలీస్ స్టేషన్ భవనాలకు, ఆలేరులో రూ.15కోట్లతో నిర్మించే మార్కెట్ యార్డు గోదాములకు శంకుస్థాపన చేస్తారు.


తుర్కపల్లి మండలం తిర్మలాపురంలో సిద్ధమైన సభావేదిక

సీఎం పర్యటన షెడ్యూల్ ఇలా..

సీఎం రేవంత్‌రెడ్డి తుర్కపల్లి మండలంలోని తిర్మలాపూర్ సభాస్థలికి మధ్యాహ్నం 3 గంటలకు చేరుకోనున్నారు. 2.40కి హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్ ద్వారా బయలుదేరి తిర్మలాపూర్ చేరుకుంటారు. 3.10కి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం అక్కడే జరిగే బహిరంగసభలో పేదలకు సంక్షేమ పథకాల ప్రొసీడింగ్స్ అందజేస్తారు. 5 గంటలకు హెలికాప్టర్‌లో తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్తారు.

సీఎం వెంట రానున్న ప్రముఖులు వీరే..

సీఎం రేవంత్‌రెడ్డి వెంట శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదరం రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖతో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు రానున్నారు.

తక్కువ ధరకు సిమెంట్ ఇప్పిస్తా

- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి


లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్సీ

మునుగోడు : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ ధరకు సిమెంట్ అందించేందుకు కృషి చేస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. చండూరు డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గురువారం మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలసి మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సిమెంట్ కంపెనీ యజమానులతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో మాట్లాడించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ ధరకు సిమెంట్ అందేలా చేస్తానన్నారు. కొందరు అధికారుల అలసత్వం వల్ల కొన్ని గ్రామాల్లో అనర్హులకు ఇళ్లు మంజూరయ్యాయని.. వాటిని అధికారులు సరిద్దిది అర్హులకు అందేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ పథకాలతో పాటు ఈ ప్రాంతానికి సాగునీరు అందించితీరుతానన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ పదేళ్లు రాష్ట్రాన్ని పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం పథకాలను ఆ పార్టీ కార్యకర్తలకు మాత్రమే ఇచ్చిందని.. అలాంటి తప్పిదాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు శ్రీనివాస్, అమిత్ నారాయణ్, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, చండూరు ఆర్డీఓ రమణారెడ్డి, మార్కెట్ చైర్మన్ దొటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

30 రోజుల్లో పనులు మొదలు పెట్టాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఇందిరమ్మ ఇంటి మంజూరు తీసుకున్న లబ్ధిదారులు 30 రోజుల్లో నిర్మాణ పనులు మొదలు పెట్టాలని, నిర్ణిత సమయంలో మొదలు పెట్టకుంటే ఇల్లు రద్దు చేయాల్సి వస్తుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 400 చదరపు అడుగులు తగ్గకుండా 600 చదరపు అడుగులు పెరగకుండా ఇంటి నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఇళ్ల నిర్మాణం పనులు పరివేక్షించేందుకు జిల్లా వ్యాప్తంగా 17 మందిని నియమించామని తెలిపారు.

రైతుకు రక్ష.. భూసార పరీక్ష

- నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ కింద 15 మండలాలు ఎంపిక
- ఎంపిక చేసిన రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరణ
- సహజ వ్యవసాయంపై రైతులకు అవగాహన


చింతపల్లి మండలంలో భూసార పరీక్ష కోసం మట్టిని సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

దేవరకొండ : వ్యవసాయంలో ఎరువుల వాడకంపై అవగాహన లేక దిగుబడులు తగ్గి రైతన్నలు కొన్ని సందర్భాల్లో నష్టాలపాలవుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు నేల స్వభావాన్ని తెలుసుకొని అందుకు అవసరమైన విధంగా రైతులు పంటలకు ఎరువులు అందిస్తే మేలంటున్నారు వ్యవసాయ అధికారులు. ఈ అంశాలపై ప్రభుత్వాలు దృష్టి సారిస్తూ భూసార పరీక్షలు చేపడుతున్నాయి. అందులో భాగంగా నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ స్కీం కింద జిల్లా వ్యాప్తంగా మొత్తం 15 మండలాలను ఎంపిక చేశారు. ఈ స్కీంలో భాగంగా ప్రతి మండలంలో 125 మంది రైతులను ఎంపిక చేసి వారి పొలాల్లో మట్టి నమూనాల సేకరణ ప్రారంభించారు. రైతులకు సహజ వ్యవసాయంపై అవగాహన కల్పించి మోతాదుకు మించి రసాయనాలు వాడకుండా చూడనున్నారు. మట్టి నమూనాల సేకరణ అనంతరం జియో ట్యాగింగ్ సైతం చేయనున్నారు. మట్టి పరీక్షల అనంతరం రైతులు పండించే పంటలకు ఎరువులు, రసాయనాల వినియోగంపై అవగాహన కల్పించనున్నారు.

ఎంపికైన మండలాలు ఇవే..

నల్లగొండ, తిప్పర్తి, మిర్యాలగూడ, దామరచర్ల, వేములపల్లి, మాడ్గులపల్లి, మునుగోడు, చండూరు, శాలిగౌరారం, అనుముల, నిడమనూరు, తిరుమలగిరి సాగర్, చింతపల్లి, త్రిపురారం, కట్టంగూర్.

అధిక దిగుబడులు సాధించవచ్చు



భూసార పరీక్షలు చేయడం ద్వారా రైతులకు అన్ని విధాల లాభం చేకూరుతుంది. అనవసర ఎరువుల వినియోగం తగ్గి ఖర్చు ఆదా అవుతుంది. పంటలకు అవసరమైన పోషకాలు అందించి నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చు. ఎంపిక చేసిన ప్రతి మండలంలో 125 మంది రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి.. భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు తగు సూచనలు అందిస్తాం. – శ్రవణ్‌కుమార్, డీఏఓ, నల్లగొండ

భూసార పరీక్షతో లాభాలు ఇలా..

భూసార పరీక్ష ద్వారా నేల స్వభావాన్ని గుర్తించి అవసరం మేరకు ఎరువులు ఉపయోగించవచ్చు. భూమిలో ఉన్న పోషకాలను తెలుసుకోవచ్చు తద్వారా రైతులు సాగు చేసిన పంట ఆరోగ్యవంతంగా ఉంటుంది. పంట సాగులో తక్కువ పెట్టుబడులు అవసరం పడుతాయి. సాంకేతిక సాగు ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. ప్రస్తుతం చేస్తున్న భూసార పరీక్షలతో ఎరువుల వాడకాన్ని అంచనా వేయడంతో పాటు పరీక్షల కోసం వచ్చే రైతులు తన భూమి వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా ఆయా గ్రామాల్లో ఏఏ రకాల ఎరువులు ఎంత పరిమాణంలో అవసరం అనేది స్పష్టంగా అంచనా వేయవచ్చు. దీని వల్ల ఎరువుల వాడకం తగ్గడమే కాకుండా పలు లాభాలు చేకూరనున్నాయి.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడు మృతి


దామోదర్ (ఫైల్)

ఆలేరురూరల్: రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన బింగి దామోదర్(32) తన తల్లితో ఉంటూ కోడిగుడ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. దామోదర్ బుధవారం పని నిమిత్తం బైక్‌పై ఆలేరుకు వచ్చి తిరిగి సాయంత్రం స్వగ్రామానికి వెళ్తుండగా.. కొలనుపాక వాగు వద్దకు రాగానే బైక్, ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దామోదర్‌ను వరంగల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. మృతుడి అన్న గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కొండల్‌రావు తెలిపారు.

పశువులను తరలిస్తున్న లారీల పట్టివేత

బీబీనగర్: లారీల్లో అక్రమంగా పశువులను తరలిస్తుండగా బీబీనగర్ మండల పరిధిలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద గురువారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి నుంచి హైదరాబాద్ వైపు రెండు లారీల్లో 155 పశువులను తరలిస్తుండగా పట్టుకుని, సరైన ఆధారాలు చూపకపోవడంతో పశువులను గోశాలకు తరలించినట్లు సీఐ తెలిపారు.

అస్వస్థతకు గురై వ్యక్తి మృతి

చౌటుప్పల్: వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురై వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా జగ్గయ్యపేట గ్రామానికి చెందిన వ్యక్తి పడాల వెంకటేశ్వరరావు(50) యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శాంతినగర్‌కాలనీలో నివాసముంటున్నాడు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులో గల శ్రీపతి ల్యాబ్ పరిశ్రమలో ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం ఇంట్లోనే వెంకటేశ్వరరావు వాంతులు, విరేచనాలు చేసుకున్నాడు. శ్వాస తీసుకోవడంలో కూడా ఇబ్బందికి గురయ్యాడు. వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య పడాల పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

డైట్ సెట్‌లో 20వ ర్యాంకు


రామకృష్ణ

మిర్యాలగూడ టౌన్ : డైట్ సెట్ ఫలితాల్లో మిర్యాలగూడ మండలం బి.అన్నారం గ్రామానికి చెందిన బి.రామకృష్ణ రాష్ట్రస్థాయిలో 20వ ర్యాంకు సాధించాడు. డైట్ సెట్ ప్రవేశ పరీక్షను మే 25న నిర్వహించగా.. గురువారం ఫలితాలు విడుదలయ్యాయి. రామకృష్ణ 5వ తరగతి వరకు బి.అన్నారంలో, ఇంటర్మీడియట్ వరకు రాజపేట గురుకుల పాఠశాలలో, డిగ్రీ నిజాం కళాశాలలో, పీజీ ఓయూలో పూర్తి చేశాడు.

అటానమస్‌కే.. ఆదరణ

- ఉమ్మడి జిల్లాలో డీలా పడ్డ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు
- 'దోస్త్' మొదటి విడతలో 9.2 శాతం మాత్రమే అడ్మిషన్లు
- మూడు ప్రభుత్వ, ఏడు ప్రైవేట్ కళాశాలల్లో సున్నా అడ్మిషన్లు
- 21 కళాశాలల్లో 10మంది లోపే..



ఉమ్మడి జిల్లాలో దోస్త్ మొదటి విడత అడ్మిషన్ల తీరు ఇలా..

ప్రభుత్వ అటానమస్ కళాశాలలు	03
చేరిన విద్యార్థులు	1272
ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	08
చేరిన విద్యార్థులు	132
ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు	50
చేరిన విద్యార్థులు	826

కోదాడ: ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు అడ్మిషన్లు లేక వెలవెలబోతున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందక ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో సగం కళాశాలలు మూతపడగా.. వారం రోజుల క్రితం దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్స్ ఇన్ తెలంగాణ) ద్వారా డిగ్రీ కళాశాలలకు జరిగిన మొదటి విడత విద్యార్థుల కేటాయింపు చూసిన తర్వాత ప్రస్తుతం ఉన్న కళాశాలల్లో కూడా సగానికి పైగా మూతపడటం ఖాయమని పలువురు డిగ్రీ కళాశాలల నిర్వాహకులు అంటున్నారు. అటానమస్(స్వయం ప్రతిపత్తి) ఉన్న కళాశాలల్లో మాత్రమే విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపుతుండగా.. అటానమస్ లేని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చేరడానికి విద్యార్థులు ఆసక్తి కనబర్చడం లేదు.

పదిశాతం కూడా నిండలేదు..

మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 11 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలుండగా.. వీటిలో మూడు కళాశాలలకు మాత్రమే స్వయం ప్రతిపత్తి(అటానమస్) హోదా ఉంది. దోస్త్ మొదటి విడతలో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో 2,230 మంది విద్యార్థులు మాత్రమే డిగ్రీ కోర్సుల్లో చేరారు. ఆయా కళాశాలల్లో అందుబాటులో ఉన్న సీట్లలో ఇవి కేవలం 9.2 శాతం మాత్రమే. ఇక స్వయం ప్రతిపత్తి ఉన్న నల్లగొండలోని నాగార్జున(ఎన్జీ) ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, కోదాడలోని కేఆర్ఆర్ డిగ్రీ కళాశాలల్లో 1,271 మంది విద్యార్థులు చేరారు. స్వయం ప్రతిపత్తి లేని 8 ప్రభుత్వ కళాశాలల్లో కేవలం 132 మంది మాత్రమే చేరారు. మూడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో జీరో అడ్మిషన్లు ఉన్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

కోదాడలో మిగిలింది ఒక్కటే..

కోదాడలో గతంలో ఒక ప్రభుత్వ, 5 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలుండేవి. కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీటు రావాలంటే మంత్రుల స్థాయి పైరవీలు కావాల్సి వచ్చేది. గత విద్యాసంవత్సరం నుంచి ఈ కళాశాల స్వయం ప్రతిపత్తి పొందడంతో ప్రస్తుతం దోస్త్ మొదటి విడతలో 64 మంది విద్యార్థులు చేరారు. రెండు, మూడు విడతల్లో మరికొంత మంది విద్యార్థులు ఇక్కడ చేరుతారని అధ్యాపకులు అంటున్నారు. ఇక నాలుగు ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఈ విద్యాసంవత్సరం మొదటి సంవత్సరం అడ్మిషన్లు తీసుకోలేదు. గతంలో మాదిరిగా ఒక్క కేఆర్ఆర్ డిగ్రీ కళాశాల మాత్రమే కోదాడలో మిగిలే అవకాశం ఉందని పలువురు విద్యావేత్తలు అంటున్నారు.

నానాటికీ తీసికట్టు

ముఖ్యంగా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల పరిస్థితి నానాటికీ తీసికట్టు అన్న చందంగా తయారైంది. ఉమ్మడి జిల్లాలో గతంలో 100కు పైగా ప్రైవేట్ డిగ్రీ కళాశాలలుండగా.. ప్రస్తుతం వాటి సంఖ్య 50కు చేరింది. ఈ కళాశాలలన్నింటిలో కలిపి దోస్త్ మొదటి విడతలో కేవలం 826 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. 7 ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో సున్నా అడ్మిషన్లు ఉండగా.. 16 కళాశాలల్లో 10లోపు విద్యార్థులు మాత్రమే అడ్మిషన్లు తీసుకున్నారు. కొన్ని కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య కన్నా అధ్యాపకుల సంఖ్యే ఎక్కువగా ఉంది. కళాశాలల్లో చేరిన 10మంది విద్యార్థుల్లో ఒక్కో గ్రూప్‌నకు ఇద్దరు ముగ్గురు మాత్రమే చేరారు. వీరితో మూడు సంవత్సరాలు తరగతులు ఎలా నిర్వహించాలో అర్థం కావడం లేదని, రెండో విడతలో చేరిన విద్యార్థులను బట్టి కళాశాల నిర్వహణపై నిర్ణయం తీసుకుంటామని ప్రైవేట్ కళాశాలల యజమానులు చెబుతున్నారు.

సీఎం సభకు భారీ ఏర్పాట్లు


ప్రజలు కూర్చునేందుకు ఏర్పాటు చేసిన గ్యాలరీలు

- 100 మంది కూర్చునేలా వేదిక ఏర్పాటు
- 21 వేల మంది లబ్ధిదారుల కోసం ప్రత్యేక గ్యాలరీ
- 1500 మంది పోలీసులతో భారీ బందోబస్తు

యాదగిరిగుట్ట: తుర్కపల్లి మండలం తిర్మలాపూర్‌లో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్న బహిరంగ సభ కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలేరు నియోజకవర్గ వ్యాప్తంగా రూ.1,500కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనతో పాటు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లు, రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు సీఎం అందజేయనున్నారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్వయంగా సభా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డితో పాటు ఆయా శాఖల అధికారులు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

భారీ వేదిక..

వర్చువల్‌గా అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. 20 ఎకరాల్లో బహిరంగ సభకు సంబంధించిన స్థలాన్ని తీర్చిదిద్దారు. సీఎంతో పాటు మంత్రులు, ఇతర ప్రముఖులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు సుమారు 100 మంది కూర్చునేలా వేదికను సిద్ధం చేశారు. వర్షం పడితే ప్రజలకు ఇబ్బందులు లేకుండా రెయిన్ ప్రూఫ్ టెంట్లు, ఎల్ఈడీ స్క్రీన్‌లను సైతం ఏర్పాటు చేశారు. సభ సాయంత్రం జరగనున్న నేపథ్యంలో విద్యుత్ దీపాలు సైతం బిగిస్తున్నారు. ప్రజలు, నాయకులు, కార్యకర్తలతో పాటు మీడియాకు, వివిధ శాఖ అధికారులు, ఆలేరు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే 21వేల మంది లబ్ధిదారులు కూర్చునేందుకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. సీఎం చేతుల మీదుగా 12మంది లబ్ధిదారులు ప్రొసీడింగ్‌లు, చెక్కులు అందుకోనున్నారు.

ప్రత్యేక బందోబస్తు..

రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం నుంచి సభ ముగిసే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఐదుగురు డీసీపీలు, 12మంది అదనపు డీసీపీ, 20మంది ఏసీపీలు, 50మంది సీఐలు, 150 మంది ఎస్ఐలు సివిల్, ట్రాఫిక్, సీఆర్‌పీఎఫ్, ఎస్‌బీ, ఇంటలిజెన్స్ పోలీసులతో పాటు 1500 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు..

ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. తిర్మలాపూర్, వీరారెడ్డిపల్లి గ్రామాల సమీపంలో సుమారు 30 ఎకరాల స్థలంలో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు. నాలుగు చోట్ల పార్కింగ్ కోసం స్థలాన్ని సిద్ధం చేశారు. మొత్తం 4 విభాగాలుగా పార్కింగ్ స్థలాన్ని విభజించి, ట్రాఫిక్ పోలీసులు సూచించిన స్థలంలో ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకుంటామని పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు.

సభా స్థలంలోనే శంకుస్థాపన..

తుర్కపల్లి: గంధమల్ల రిజర్వాయర్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, మోటకొండూరు మండల కేంద్రంలో ఎంపీడీఓ, తహసీల్దార్, పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాలకు, రోడ్లు, దాతర్‌పల్లిలో గోదాములు, కొలనుపాక, కాల్వపల్లి హైలెవల్ బ్రిడ్జిలకు సభా స్థలంలోనే సీఎం శంకుస్థాపన చేయనున్నారు.

సభ ఏర్పాట్లపై సమీక్ష..

సభ స్థలాన్ని అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డితో కలిసి కలెక్టర్ హనుమంతరావు పరిశీలించారు. ఈ సందర్భంగా సభ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేశ్యా నాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం..

తుర్కపల్లి, బీబీనగర్: సభలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. గురువారం సభా వేదికను ఆయన పరిశీలించి మాట్లాడారు. సీఎం హెలికాప్టర్ ల్యాండింగ్ ప్రదేశంతో పాటు సభా వేదిక చుట్టూ మెటల్ డిటెక్టర్లను అమర్చినట్లు తెలిపారు. అదేవిధంగా వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును కూడా సీపీ సుధీర్‌బాబు పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలకు సంబంధించి పోలీసులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీసీపీ అక్షాంశ్‌యాదవ్ ఉన్నారు.


సభా వేదికను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

పేదలను ప్రభుత్వం ఆదుకోవాలి


రెడ్డి సంక్షేమ సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న గంగిడి ప్రతాప్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి: రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి రెడ్డి సామాజిక వర్గంలోని పేదలను ఆదుకోవాలని రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు గంగిడి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం పోచంపల్లి పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మించిన రెడ్డి సంక్షేమ సంఘం నూతన భవనాన్ని స్థల దాత గంగిడి నర్సింహారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. రెడ్డి సామాజిక వర్గంలో కూడా ఎందరో నిరుపేదలున్నారని అన్నారు. వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, తెల్ల రేషన్‌కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం స్థల దాతతో పాటు భవన నిర్మాణానికి సహకరించిన దాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామసాని చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు నోముల నాగిరెడ్డి, ఏనుగు సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి సగ్గు మల్లారెడ్డి, సహాయ కార్యదర్శి కొమిరెల్లి శేఖర్‌రెడ్డి, కోశాధికారి కేసారం కొండల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు కోట పుష్పలతమల్లారెడ్డి, గుణంగారి సదానందరెడ్డి, ఏనుగు కిషన్‌రెడ్డి, బొక్క బాల్‌రెడ్డి, సామల మల్లారెడ్డి, కొమిరెల్లి బాల్‌రెడ్డి, గంగిడి సుదర్శన్‌రెడ్డి, నోముల భీమ్‌రెడ్డి, ఏనుగు మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి


శ్రీను (ఫైల్)

నడిగూడెం: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడడంతో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన గురువారం నడిగూడెం మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిపురం గ్రామానికి చెందిన ఆత్కూరి శ్రీను (40) అదే గ్రామానికి చెందిన ఓ రైతు వ్యవసాయ భూమికి గురువారం ట్రాక్టర్‌లో మట్టి తోలుతుండగా.. ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో శ్రీను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి తల్లి మహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నడిగూడెం స్టేషన్ ఇన్‌చార్జి మల్సూర్ తెలిపారు.

పొలం దున్ని వస్తుండగా..


ఉపేందర్‌రెడ్డి (ఫైల్)

గరిడేపల్లి: గరిడేపల్లి మండలం సర్వారం గ్రామానికి చెందిన కర్నాటి ఉపేందర్‌రెడ్డి(35) గురువారం తన పొలంలో దుక్కి దున్ని ట్రాక్టర్‌పై ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్ ఉపేందర్‌రెడ్డిపై పడటంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి


రైతులకు వరి సాగుపై అవగాహన కల్పిస్తున్న భారత వరి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త శ్రీదేవి

తాళ్లగడ్డ (సూర్యాపేట): వరి సాగులో అధిక దిగుబడికి సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఐసీఏఆర్, భారత వరి పరిశోధనా సంస్థ-హైదరాబాద్ ప్రధాన శాస్త్రవేత్త బి. శ్రీదేవి అన్నారు. సూర్యాపేట మండలం తాళ్ల ఖమ్మంపహాడ్ గ్రామంలో గురువారం కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం కేవీకే శాస్త్రవేత్త నరేష్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు అందిస్తున్న సేవలు, శిక్షణ కార్యక్రమాలను రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. జీవ ఎరువులు, శిలీంద్రనాశినిల గురించి రైతులకు తెలియజేశారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎన్. సుగంధి మాట్లాడుతూ.. చిరుధాన్యాలతో తయారుచేసే ఉత్పత్తుల గురించి రైతులకు వివరించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ముత్తయ్య, గ్రామ కార్యదర్శి కె. రేవతి, తుమ్మల రాము, వై. శ్రీను, కనకయ్య శంకర్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గురువారం శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రాతఃకాలార్చన, సుప్రభాత సేవ, నిత్యాగ్నిహోత్రి, పంచామృతాభిషేకం, అష్టోత్తర, సహస్ర నామార్చనలు, కుంకుమార్చనలు చేసి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. అనంతరం విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మాంగళ్యధారణతో కల్యాణం జరిపించారు. స్వామి, అమ్మవార్లను గరుడ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్ కుమార్, మట్టపల్లి రావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు


బోల్తా పడిన కారు


నుజ్జునుజ్జయిన ద్విచక్ర వాహనం

- నలుగురికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

శాలిగౌరారం: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన 365వ నంబర్ జాతీయ రహదారిపై శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామ సమీపంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం ధర్మారం గ్రామానికి చెందిన మందుల ముఖేష్, బూరుగుల సన్నీ, సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన కట్టికోల సాయిచరణ్ కలిసి ద్విచక్ర వాహనంపై 365వ నంబర్ జాతీయ రహదారి మీదుగా హైదరాబాద్‌కు వెళ్తుండగా.. అదే సమయంలో హైదరాబాద్ నుంచి మరిపెడ బంగ్లాకు అతివేగంగా వెళ్తున్న కారు శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామ సమీపంలోని ఫంక్షన్‌హాల్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నుజ్జునుజ్జు కాగా.. మందుల ముఖేష్, బూరుగుల సన్నీ, కట్టికోల సాయిచరణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కారు జాతీయ రహదారి పక్కన బోల్తా పడడంతో కారు నడుపుతున్న వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మందుల ముఖేష్, కట్టికోల సాయిచరణ్‌ను మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సాయిచరణ్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

యాదగిరీశుడిని దర్శించుకున్న ఉత్తరాఖండ్ ఎంపీ


రాజ్యసభ సభ్యుడు నరేష్ బన్సల్‌కు వేద ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని ఉత్తరాఖండ్ రాజ్యసభ సభ్యుడు(ఎంపీ) నరేష్ బన్సల్ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి, ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చనమూర్తుల చెంత అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. ఎంపీ కుటుంబ సభ్యులకు అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

కాంగ్రెస్‌ది కమీషన్ల ప్రభుత్వం


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నల్లగొండ టూటౌన్ : కాంగ్రెస్‌ది కమీషన్ల ప్రభుత్వంగా మారిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు విమర్శించారు. మోదీ ప్రభుత్వం 11 ఏళ్ల పరిపాలనపై గురువారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే డిజిటల్ లావాదేవీల్లో భారతదేశంలోనే 40 శాతం ఉండటం గర్వకారణమన్నారు. దేశంలో 80 శాతం మంది ప్రజలకు రేషన్ బియ్యం ఇస్తున్నట్లు తెలిపారు. 11 ఏళ్ల కేంద్ర ప్రభుత్వ విజయాలను బీజేపీ కార్యకర్తలు ప్రజల్లో ప్రచారం చేయాలని కోరారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా ఒరిగింది శూన్యమన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా నల్లగొండలోని 16వ వార్డులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాసగౌడ్, పల్లెబోయిన శ్యాంసుందర్, వీరెల్లి చంద్రశేఖర్, పోతెపాక లింగస్వామి, రాములు, పకీర్ మోహన్‌రెడ్డి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన

తాళ్లగడ్డ (సూర్యాపేట): సూర్యాపేట మండలంలోని రాయినిగూడెం వికాస్ ఫార్మసీ కళాశాలలో తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో గురువారం యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాలలో వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నీల మాట్లాడుతూ.. డ్రగ్స్ విషం కన్నా ప్రమాదమైనదని, యువత డ్రగ్స్‌కు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. సమాజంలో ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యతగా డ్రగ్స్ నివారణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పెద్దింటి నవీన్‌కుమార్, అధ్యాపకులు డాక్టర్ స్వరూప, డాక్టర్ నరసింహారావు, డాక్టర్ నటేష్, మహేష్, ప్రీతం కుమార్, సుజాత, భవాని, తులసి, ఫర్హిన్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పిస్తున్న నార్కొటిక్స్ బ్యూరో సభ్యులు



SANA COLLEGE OF TEACHER EDUCATION
(Recognized by NCTE, New Delhi and Affiliated to MG University, (Nalgonda)
KODAD-508206, Suryapet Dist.Telangana state-508206 cell.9989933786, 9963921772.

WANTED FACULTY

Applications are invited for the post of principal & Lecturer as follows

1. **Principal:** No of Post-01
Qualifications : Postgraduate degree in Arts/Sciences/Social Sciences/ Humanities/Commerce with minimum 55% marks and A Master of Education (M.Ed.) with at least 55% marks, and a Ph.D. in Education or a related field. Minimum of 8 years of teaching experience in a related field

2. **Pedagogy Subject :** No of Post-01 Biological science.
Qualifications: Postgraduate degree in concern subjects with at least 55% marks and A Master of Education (M.Ed.) with at least 55% marks, with NET/SLET/Ph.d

3. **ARTS EDUCATION :** No of Post-02 Fine arts & Performing Arts
Qualifications: Postgraduate degree visual arts and fine arts with at least 55% marks or its equivalent grade

Note: Preference will be give experienced candidate for all posts. The eligible. Candidates can send their applications forms to the college along with Xerox copies & two passport size photos. On are before 13/06/2025

Contact: Secretary /Correspondent. 9989933786, 9963921772.

సాక్షి క్లాసిఫైడ్స్


Wanted

■ Wanted Experienced Pre-Primary Teachers. Vishishta High School, Nalgonda. Skills Required : Fluent English Speaking (Mandatory) Contact : 9700223676 [Y-SCA25004605]

■ హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో పని చేయుటకు సెక్యూరిటీ సిబ్బంది కావలెను. అర్హత 8th to డిగ్రీ జీతం: 16 - 21 వేలు, ఉచిత వసతి. సం.ప్ర. 9346179320, 8374785784 [SCA 25004581]

■ Wanted Experienced, Qualified and Fluent in English Principal and Teachers for Hindi, English, Physics, Social. Salary Negotiable, walk in interview with Resume on 07-06-25 from 09:00 am. to 04:00 pm. at Gandhij E.M.School, Chandur and Nampally, Nalgonda District. Contact. Cell: 94404 81414, 99663 71121. [SCA25004511]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ.:220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
5% GST అదనం
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
సూర్యాపేట : 9912220740 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.